క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రుద్రవరం: మండల కేంద్రానికి మంగళవారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాల కల్యాణ మండపంలో ముందుగా పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారని, అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

శివుడికి ప్రత్యేక పూజలు



కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): మాఘమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సోమనంది, నాగనంది, ప్రథమనంది, కాళికాంబ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులకుంట దేవాలయంలో స్వామి వారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి మహాన్యాస పూర్వక ఏక వార రుద్రాభిషేకం జరిపించి నాగాభరణంతో అలంకరించారు. శ్రీకాళికాంబ దేవస్థానంలో స్వామి వారికి విశేష పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష విధించినట్లు కోర్టు, పోలీసు సిబ్బంది సోమవారం తెలిపారు. వివరాలు..పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా, దూదేకుల అల్తాఫ్, చాతూర్ సర్దార్ మద్యం సేవించి మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈలలు, కేకలు వేస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి 5రోజులు, మరొకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష ఖరారు చేసినట్లు చెప్పారు.

జాతీయ ఉత్పాదకత దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ ఉత్పాదకత దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్పాదకత గురించి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అనంతరం వ్యాసరచన చర్చ, క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బుగ్గరామేశ్వర ఆలయాభివృద్ధికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న ధర్మకర్తల కమిటీ

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామంలో వెలసిన శ్రీ బుగ్గరామేశ్వర దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ కమిటీ నూతన చైర్మన్ అనసూయమ్మ తెలిపారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జగదీశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది విజయశేఖర్‌రెడ్డి సహకారంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఆలయ ఆవరణలో సోమవారం ఈఓ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నూతన కమిటీ చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ ధర్మకర్తలతో ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తలు శైలజ, లక్ష్మీతులసి, మహేశ్వరి, బాలునాయక్, హుసేని, సుబ్బయ్య, కాశీం పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

ఆళ్లగడ్డ: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, ఉమాదేవి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. సభ్యులు రమాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అన్నదాన పథకానికి విరాళాలు

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి మహానందికి చెందిన భక్తులు పిక్కిలి శివ ప్రసాద్, పిక్కిలి శివ శంకర్ సోమవారం ఒక్కొక్కరు రూ. 10,116 చొప్పున విరాళం అందజేశారు. విరాళం చెల్లించిన దాతలకు ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగన్న స్వామి అమ్మవారి ప్రసాదాలు, బాండ్లు అందించారు.



ఉదయం ఎనిమిది గంటల సమయంలో భాగ్యనగరం రహదారి ఇలా..



దొర్నిపాడు సమీపంలో భానుడిని బందీగా చేసిన మంచు

కమ్మేసిన మంచు తెర

- శీతాకాలం చివర్లో తొలిసారిగా కురిసిన మంచు
- గ్రామాలపై కమ్ముకున్న మంచు దుప్పటి
- శీతల ప్రాంతాలను తలపించిన రహదారులు
- పరవశించిన ప్రకృతి ప్రేమికులు



కొండాపురం సమీపంలో మంచుకురుస్తుండటంతో దుప్పటిలా సాలీడు గూళ్లు

దొర్నిపాడు: శీతాకాలం ప్రారంభంలోని లేని పొగమంచు సీజన్ ముగిసే సమయంలో కమ్ముకోవడంతో మండల ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక శీతాకాలంలో చలి ఎక్కువగా ప్రభావం చూపలేదు. నల్లమల అటవీ ప్రాంతం జిల్లాను ఆనుకొని ఉండటం, కొండలు అధికంగా ఉండటంతో ఏటా పొగమంచు ఎక్కువగా కురిసేది. అయితే ఈ ఏడాది రెండు, మూడు రోజులు మాత్రమే అలా వచ్చి వెళ్లింది. సాధారణంగా సంక్రాంతి తరువాత చలి పూర్తిగా తగ్గిపోయి, శివరాత్రి నాటికి శివ శివ అనిపించి వెళ్లిపోతుందని నానుడి. ఎండలు ఈ నెల మొదటి నుంచే ముదిరాయి. దీంతో 39 డిగ్రీలు నమోదవుతున్న వేళ సోమవారం ఎన్నడూ లేని విధంగా మంచు కురిసింది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భాగ్యనగరం గ్రామ పరిసరాలు కోస్తాను తలపించాయి. దారి వెంట సాలీడు గూళ్లపై పంచు కురవడంతో తెల్లదుప్పటి కప్పుకున్నట్లు చూపరులను కనువిందు చేశాయి. నాలుగు నెలలుగా ఇంత మంచు చూడలేదని రైతులు పేర్కొంటున్నారు.



ఉయ్యాలవాడలో పొదుపు మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల, ప్రభాకర్‌రెడ్డి

మహిళల అభ్యున్నతికి సీఎం కృషి



సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు

ఉయ్యాలవాడ : పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తుందని, తద్వారా కుటుంబాలు బాగుపడుతాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమానికి పెద్ద పీట వేశారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత సంబరాలు నిర్వహించారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, అధికారులతో పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేశారు. వారు మాట్లాడుతూ పొదుపు మహిళలను లక్షాధికారులను చేయాలనే సంకల్పంతోనే వైఎస్సార్ పావలా వడ్డీని ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని అమలు చేశారని కొనియాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి పొదుపు మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. చెప్పింది చేస్తున్న నాయకులను నమ్ముతారా, లేదా వస్తే చేస్తామనే వారిని నమ్ముతారా అని ప్రశ్నించారు. పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని మహిళలను కోరారు. అనంతరం మండలంలోని 291 పొదుపు గ్రూపుల్లోని 2,913 మంది పొదుపు మహిళలకు రూ.1.48,45,171 మెగా చెక్కు అందజేశారు. అనంతరం పొదుపు మహిళలు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా వెలుగు ప్రాజెక్ట్ అధికారి దానం, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ రఘురాం, ఏపీఎం దాసు, సింగిల్ విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి,, పల్లె మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మేకల ఓబులేసు, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, జేసీఎం కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య (బుజ్జి), మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జిల్లాలో అర్హత కలిగిన జర్నలిస్టులకు ప్రభుత్వ ఉత్తర్వుల నంబర్. 535లోని మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న ఇళ్ల స్థలాలకు సంబంధించి జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. డీఆర్‌ఓ పద్మజ, జిల్లా హౌస్ సైట్స్ కమిటీ సభ్యులు పి.హరినాథరెడ్డి, సురేష్, నాగప్రసాద్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించి తుది జాబితా మేరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని జర్నలిస్టుల నుంచి 328 దరఖాస్తులు వచ్చాయని, జాబితాను ఆయా నియోజకవర్గాల తహసీల్దార్‌లకు పరిశీలన నిమిత్తం పంపుతామని చెప్పారు. ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అవసరమైన ప్రభుత్వ భూములు లేదా అసైన్‌మెంట్ ల్యాండ్, పట్టా భూములను గుర్తించి గురువారం లోపు నివేదిక ఇవ్వాలని సంబంధిత ఆర్డీఓలను ఆదేశించారు. సమావేశంలో డీపీఆర్‌ఓ మల్లికార్జునయ్య, డోన్ ఆర్డీఓ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన ఆంజనేయులు

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు రోడ్డు సమీపంలోనున్న మేడం ఆయిల్ మిల్లులో మిరియాల అంజనేయులు (40) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు..తాడిపత్రి పట్టణానికి చెందిన ఆంజనేయులుకు చాగలమర్రిలోని చింతలచెరువు రస్తాలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మీతో 12ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి ఆయన అత్తగారి ఇంట్లోనే ఉంటూ హమాలీ పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. దినచర్యలో భాగంగా ఆదివారం ఉదయం హమాలీ పనికి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం మేడం మిల్లులో పడిపోయి ఉన్నాడని కొందరు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.మృతుడి తల్లి పద్మావతి భార్య ఆదిలక్ష్మీతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆంజనేయులు విగతజీవిగా పడిఉన్నాడు. ఆయన మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక హత్యకు గురయ్యాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఇంటింటికీ కుళాయి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి

ఉయ్యాలవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. గ్రామంలో రూ. 56.90 లక్షలతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు పైపులైన్ పనులు చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



కోటపాడు సచివాలయంలో రిజిస్ట్రేషన్ పక్రియ

శిరివెళ్ల: జగనన్న కాలనీలకు చెందిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మండలంలో కొనసాగుతుంది. అన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. మండలంలో 11 జగనన్న కాలనీలలో 2,205 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అందులో ఇప్పటికి వరకు 898 మందికి చెందిన పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. సచివాలయాల వారీగా.. శిరివెళ్లలో 742 పట్టాలకు గాను 297, గోవిందపల్లె 361కి గాను 193, యర్రగుంట్ల 337కు 91, చెన్నూరు 56కు 23, గంగవరంలో 84కు 74 స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. బోయలకుంట్లలో 173కు 28, మహదేవపురంలో 140కి 14, కోటపాడులో 43కు గాను 19, వనికినిదిన్నెలో 109కు గాను 57, జీనేపల్లెలో 37కు 27, గుంప్రమాన్‌దిన్నెలో 123కు గాను 75 మంది పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యింది.


ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామి పల్లకీ సేవను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై కొలువుదీర్చి ఆలయ వీధుల్లో ఊరేగించారు.

19న యాగంటిలో బహిరంగ వేలం

యాగంటి క్షేత్రంలోని ఉమా మహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సెల్‌ఫోన్లు, కెమెరాలు, లగేజీ కౌంటర్లు, మరుగుడ్ల నిర్వహణ హక్కుల కోసం ఈ నెల 19వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

మద్దిలేటి నరసింహస్వామి ఆలయ సంప్రోక్షణ



కలశాలను ఏర్పాటు చేస్తున్న అర్చకులు



మద్దిలేటి నరసింహ స్వామి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఆలయ సంప్రోక్షణ కార్యక్రమం దీక్షాహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో సోమవారం ముగిసింది. ఆలయాన్ని నరసింహస్వామి భక్తులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పునర్‌నిర్మించి ఈ నెల 10వ తేది నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కలశప్రతిష్ట, ఆలయ సంప్రోక్షణ, దీక్షాహోమం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

చాగలమర్రి: ప్రశాంత వాతావరణానికి ప్రజలందరూ సహకరించాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతునాయక్ కోరారు. సోమవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామస్తులతో సమావేశమై మాట్లాడుతూ పట్టింపులకు పోయి గొడవలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నిబంధనల అమలుకు పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్‌ఐ రమణయ్య ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం విద్యార్థి సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, రంజిత్, ప్రతాప్ కోరారు. సోమవారం పట్టణంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. శివరాముడు, మస్తాన్, మంగమ్మ, చిన్నమ్మ, జయమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేయాలి..

పట్టణంలోని ప్రధాన సెంటర్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. రామచంద్రుడు, వేణుమాధవరెడ్డి, మనోహర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కోరుతున్నా విగ్రహ ఏర్పాటుకు స్పందించడం లేదని చెప్పారు.

15న ఖోఖో జట్ల ఎంపిక

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 15న సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా 56వ ఖోఖో సీనియర్ జట్ల ఎంపికలో మహిళలు, పురుషులు పాల్గొనాలని కోరారు. ఎంపికైన జట్లు తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యం) చేరుటకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను వెబ్‌సైట్ జ్ఞి ఇ://ఽ ఇ: ఘ్బుజభ్ఫ్ఽ ఇభిజటట.జీ ఽ లో ఈనెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులో తప్పులు ఉంటే గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళ్లి దరఖాస్తు నకలతో పాటు అభ్యర్థి ఆధార్‌ను జత పరిచి దరఖాస్తులో పొందుపరిచిన తప్పును తొలగించాలో తెలియజేయాలన్నారు. అలాంటి దరఖాస్తులను 23 పనిదినాలు పరిశీలించి దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పిస్తామని పేర్కొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

రుద్రవరం: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల ఆదరణ సేవా సమితి సంఘం నాయకులు మరియదాసు, ఓబులేసు,శివమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, పింఛన్ పెంపు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



టిడ్కో గృహాల వద్ద సదుపాయాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని. పారిశుద్ధ్య నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు తాగునీటి వసతుల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం సలీంనగర్ సచివాలయాన్ని తనిఖీ చేసి సమయపాలన లోపిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అలాగే పట్టణ శివారులోని అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలను మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నరసింహమూర్తితో కలిసి పరిశీలించారు. గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది రిజ్వానా, టిడ్కో ఏఈ నాగేంద్ర ఉన్నారు.

ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగులకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, గిరిప్రసాద్ కోరారు. సోమవారం పట్టణంలోని నేషనల్ డిగ్రీ కళాశాలలో పీఆర్‌టీయూ ఏపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2000 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, అరియర్స్, డీఏ, పీఆర్సీ చెల్లించాలని, డీఎస్సీలో అప్రెంటీస్ విధానాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, ఎస్‌వీ భాస్కరరెడ్డి, భార్గవరామయ్య, కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, విజయరావు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



కలశ పూజ చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారు రైతునగర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీగౌరీ కేదార్‌నాథ్ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం వేదపారాయణం, మండప పూజలు, వైదిక అర్చనలు, క్షీరాధి వాసము, హోమాలు చేపట్టారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి హోమం నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీ రుద్ర క్రమార్చన, ధాన్యధివాసం, లక్ష్మీకుబేర, గణపతి హోమాలు, నవకలశ పూజలు జరిపించారు. ఆలయ నిర్వాహకులతో కోలాటం, భజనలు చేశారు.కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని నంద్యాల జిల్లా ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాల సమావేశ భవనంలో సోమవారం ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, చట్టాలు, నేరాలు, అక్రమ ఆయుధాలు, మద్యం, నగదు ఇతర వస్తువులు సీజ్ చేసే ప్రక్రియ, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల సమాచారం సేకరించి అక్కడ తీసుకోవల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. పోటీలో నిలిచే రాజకీయ పార్టీల నాయకుల పై నిఘా ఉంచడంతో పాటు షాడో పార్టీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ప్రక్రియ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు రమేష్‌బాబు, హనుమంత నాయక్, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.